క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2024–25 ఏడాదికి సంబంధించి, నాలుగో విడత మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నామని, అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ అనంతరం ఈ నెల 27వ తేదీలోగా దగ్గరలోని ఐటీఐ కళాశాలకు వెళ్లి, పదో తరగతి, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9000096048, 8309438446, 9959502238, 9052085679ను సంప్రదించాలన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ అన్నారు. పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మండలంలోని పణుకువలస, సోమిదవలస గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో, రోడ్లు పక్కన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్కను నాటి, సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పణుకువలస, గోపాలవలస సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకులతో సీఐ సమావేశం

బొబ్బిలి: మండల కేంద్రంలోని తన కార్యాలయంలో సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్‌ఐ రమేష్‌లు డీజే నిర్వాహకులతో మంగళవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. పరిమితికి మించి సౌండ్ లేకుండా డీజేలు వినియోగించాలని, ఎక్కడైనా ఎవరికైనా ఇబ్బంది కలిగేలా డీజేలు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే సౌండ్‌కు పలుచోట్ల కొంత మంది గుండెపోటుకు గురైన ఘటనలను ఉదాహరణ తీసుకుని మరీ అవగాహన కల్పించారు.

అప్రమత్తంగా ఉండాలి

వంగర: సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలుతున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో లోపింటి త్రినాథ్ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వ్యాధుల బారినపడకుండా ప్రజలకు ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: పట్టణంలోని సీబీఎం స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన సబ్ రిజిస్ట్రార్, తహసీల్దారు, విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు, సీపీఐ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు, రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మణనాయుడులు ఆర్‌డీవో ఎ.సాయిశ్రీని మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు.

ఒక్క మాత్రతో 'నులి'మేద్దాం!


బాడంగి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో నులిపురుగు నివారణ మాత్ర మింగిస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ మంగళవారం చేపట్టారు. అధికారులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులతో మాత్రలు మింగించారు. అపరిశుభ్రత, కలుషిత ఆహారం ద్వారా మానవ శరీరంలోని పేగులోకి చేరి, మకాం వేసే నులిపురుగులు రక్తం పీల్చి, రక్త హీనత బారినపడేలా చేస్తుందని వైద్య సిబ్బంది తెలిపారు. 19 ఏళ్లలోపు వారంతా తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకోసారి మాత్రలు అందివ్వడం జరుగుతుందని, ఆరోగ్యవంతమైన పిల్లల కోసం తప్పనిసరిగా మాత్రలు వేయించాలన్నారు. మాత్రలు మింగిద్దాం.. నులిపురుగులు నులిమేద్దాం, ఒక్క మాత్రతో నులిపురుగులు తరిమేసి, ఆరోగ్యంగా తయారవుదాం.. అని నినాదాలు చేశారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్.


రేగిడి: వన్నలి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఏఎన్‌ఎం, తదితరులు


వంగర: మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీడీవో త్రినాథ్


తెర్లాం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం -5లో చిన్నారుల నోట్లో మాత్రలు వేస్తున్న ప్రధానోపాధ్యాయుడు రమేష్, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి


రేగిడి: లక్ష్మీపురం పాఠశాలలో విద్యార్థినులతో మాత్రలు వేయిస్తున్న సిబ్బంది


రామభద్రపురం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ ఎస్‌లో విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది


రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాత్రలు మింగిస్తున్న ఏఎన్‌ఎం, సిబ్బంది


బొబ్బిలి రూరల్: పిరిడిలో విద్యార్థులతో నులిపురుగు నివారణ మాత్రలు మింగిస్తున్న ఎంపీడీవో రవికుమార్

ఏచూరి పోరాటం స్ఫూర్తిదాయకం


ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాజాం సిటీ: కార్మికులు, రైతులు, బడుగుల అభివృద్ధి, సంక్షేమానికి కామ్రేడ్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు కొనియాడారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, మంగళవారం నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కష్టజీవుల పక్షపాతి సీతారాం ఏచూరి అని, పేదల పక్షాన ఎన్నో ప్రజాఉద్యమాలు నడిపి, అండగా నిలిచారన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం ఆయన సాగిన విధానం ఆదర్శనీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఉమాకుమారి, ఉమ, రమణమ్మ, సూర్యకళ, చిన్నమ్ముడు, విజయలక్ష్మి, జయలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


రాజాం సిటీ: విశ్వకర్మ పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజాం సిటీ: పట్టణంలోని కస్పా వీధిలో శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. సప్తవర్ణ పుష్పాలతో విశ్వకర్మ విగ్రహాన్ని అలంకరించి, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. రెండు రోజుల పాటు ఈ పూజ కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

బొబ్బిలి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విశ్వకర్మ జయంతి మంగళవారం ఓ వేడుకలా నిర్వహించారు. పాతకోట వద్ద జరిగిన కార్యక్రమానికి సీఐ కె.సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, కాసేపు ప్రసంగించారు. దేవతల గురువుగా పేరొందిన భగవాన్ విశ్వకర్మను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలని, మహనీయుల మంచి కార్యాలను గుర్తుచేసుకుని, భవిష్యత్ తరాలకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎ.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి: పాతకోట వద్ద విశ్వకర్మ పూజల్లో సీఐ సతీష్‌కుమార్, తదితరులు

23లోగా ఈకేవైసీ చేసుకోవాలి


వంగర: చినరాజులగుమ్మడలో రైతులతో మాట్లాడుతున్న ఏవో కన్నబాబు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఈ నెల 23వ తేదీలోగా ఈకేవైసీ చేసుకోవాలని ఏవో తట్టికోట కన్నబాబు సూచించారు. మండలంలోని కె.కొత్తవలస, కొప్పరవలస, మద్దివలస, తలగాం, చినరాజులగుమ్మడ గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన అక్కడి రైతులతో సమావేశమై, పలు సూచనలు చేశారు. ప్రతీ పంటకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్ల వద్దకు వెళ్లి, ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదులు చేసుకోవాలని, ఇవి చేయించుకున్న వారికే ప్రభుత్వ రాయితీలు, పథకాలు, సదుపాయాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ వేగిరెడ్డి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎంఈవోలతో పాఠశాల విద్య బలోపేతం

- డిప్యూటీ డీఈవో కె.మోహనరావు


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో మోహనరావు

రామభద్రపురం: ఇద్దరు ఎంఈవోలతో పాఠశాల విద్య మరింత బలోపేతమవుతుందని డిప్యూటీ డీఈవో కె.మోహనరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఎంఈవో–2 పోస్టులను ప్రభుత్వం ఎత్తివేస్తుందని వస్తున్న వార్తలు ఊహాగానాలే తప్ప ఏ విధమైన స్పష్టత లేదన్నారు. పరిపాలన, అకాడమిక్ సౌకర్యాల నిమిత్తం ఎంఈవో–1, ఎంఈవో–2లను కొనసాగించడంతో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కొద్దిపాటి అధికారాలు అప్పగిస్తే పాఠశాల విద్యకు మరింత మేలు జరుగుతుందన్నది ఉపాధ్యాయుల అభిప్రాయమన్నారు. పాఠశాలల్లో బాలికల కన్నా బాలురు చదువులో వెనుకబడి ఉండడం వాస్తవమేనని, వారికి ఇంటి దగ్గర తల్లిదండ్రుల పర్యవేక్షణ తగ్గుతోందన్నారు. ఆడపిల్లలు పాఠశాలలకు వెళ్లి, మళ్లీ వచ్చేంతవరకు తల్లిదండ్రులు గమనించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

రాజాం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజాం పట్టణానికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ఆర్థికసాయం చేశారు. స్థానిక పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రూ.1.86 లక్షలను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోదరుడు కోండ్రు జగదీష్‌కు మంగళవారం అందించారు. తమవంతు సాయంగా ప్రభుత్వానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో రాజాం ఏరియా సూపరింటెండెంట్ కరణం హరిబాబు, అమృత ఆస్పత్రి ఎండీ డాక్టర్ గార రవిప్రసాద్, టీడీపీ నేత పొట్నూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

రాజాం: చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల నిర్వహణ బాగుండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని సోపేరు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. మండలంలో అన్ని పంచాయతీల్లో ఈ కేంద్రాల వినియోగం పెంచాలని, ఎరువుల తయారీని ప్రారంభించి, గ్రామాల్లోని రైతులకు ఆ ఎరువులను అందించాలన్నారు. అనంతరం పొగిరి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బొబ్బిలి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆర్ అండ్ బీ జేఈ బీపీకే రాజు, మున్సిపల్, రవాణా శాఖ అధికారులతో కలిసి స్థానిక పట్టణ పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను మంగళవారం గుర్తించి, వాటిని బ్లాక్ స్పాట్‌ల జాబితాలో చేర్చారు. ఆయా చోట్ల మరెన్నడూ ప్రమాదాలు జరగకుండా తీసుకోనున్నట్లు సీఐ తెలిపారు.

రాజాం సిటీ: పట్టణంతో పాటు మండలంలోని ప్రధాన రోడ్లలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక పట్టణ పరిధిలోని గాయత్రి కాలనీ, మండల పరిధిలోని కంచరాం, గురవాం, అంతకాపల్లి ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు మంగళవారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తరచూ ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తిస్తున్నామని, ఇందులో భాగంగా నాలుగు ప్రాంతాలను గుర్తించామన్నారు. అవసరమైన చోట స్పీడు బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రమాదాల తీవ్రత తెలియజేసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. రాత్రి సమయాల్లో స్పీడు బ్రేకర్లు గుర్తించేలా రేడియం లైటింగ్ కూడా ఉండేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఆర్ అండ్‌బీ ఏఈ నాగభూషణరావు పాల్గొన్నారు.

భారీ ధర పలికిన గణపతి లడ్డూ


రాజాం: లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న ప్రియాంక కృష్ణార్జున పట్నాయక్


రాజాం సిటీ: దక్కించుకున్న లడ్డూ ప్రసాదంతో కమిటీ కుర్రోళ్లు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామ పోస్టాఫీస్ వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద లడ్డూ ప్రసాదం వేలంపాట మంగళవారం నిర్వహించారు. రూ.40,500ల భారీ ధరకు కమిటీ కుర్రోళ్లు ఆ లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గణనాథుని విగ్రహ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద ఉన్న లడ్డూ ప్రసాదానికి మంగళవారం వేలంపాట నిర్వహించారు. రూ.30 వేలకు రాజాం జేఎల్‌కే టైల్స్ ఎండీ ఆగూరు ప్రియాంక కృష్ణార్జున పట్నాయక్ దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు ఆ ప్రసాదాన్ని పంచిపెట్టారు.

సుగర్ ఫ్యాక్టరీలు తెరిపించాలి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి రూరల్: మూతపడిన భీమసింగి, ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి, నడపాలని సీపీఎం మండల అధ్యక్షుడు ఎం.గోపాలం డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండలంలోని రంగరాయపురం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ ఆధునీకరణకు నిధులు మంజూరు చేసి, ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడిపించాలన్నారు. ఆయా కర్మాగారాలు మూతపడడంతో చాలామంది కార్మికులు రోడ్డునపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డి త్రినాధ, ఉడుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొని, గ్రామాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని, వాటిని పరిశుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యవంతమైన సమాజం రూపొందుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలని, మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అవగాహన ర్యాలీలు, మానవహారాలు చేపట్టి, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


తెర్లాం: పణుకువలసలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ, తదితరులు


తెర్లాం: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ,సర్పంచ్ సత్యనారాయణ


రాజాం సిటీ: మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్


సంతకవిటి: మండల కేంద్రంలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


సంతకవిటి: మండల కేంద్రంలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


వంగర: మండల కేంద్రంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ ర్యాలీ


బొబ్బిలి రూరల్: పిరిడిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ ర్యాలీ


రామభద్రపురం: మండల కేంద్రంలో స్వచ్ఛతా హి సేవా ర్యాలీలో ఎంపీడీవో రమామణి, సర్పంచ్ ఈశ్వరరావు


రామభద్రపురం: ర్యాలీలో రామభద్రపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు


వంగర జెడ్పీహెచ్‌ఎస్‌లో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది


రేగిడి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం


బాడంగి: లక్ష్మీపురంలో మొక్కలు నాటుతున్న ఎంపీటీసీ, సర్పంచ్ తదితరులు


మెంటాడలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ సన్యాసినాయుడు, తదితరులు

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు

రేగిడి: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు మంగళవారం అందించారు. వైద్యురాలు రమాచంద్రిక అక్కడికి వచ్చిన పలువురు దివ్యాంగుల అంగవైకల్యం చూసి, ఫిజియోథెరపీ చేశారు. అనంతరం వైకల్యం సమసిపోయేందుకు పలు సూచనలు చేశారు. ఎటువంటి ఖర్చు లేకుండా ఇంటి వద్దనే ఫిజియోథెరపీ చేసుకోవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న ఈ ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, సహిత విద్య ఉపాధ్యాయులు యు.మహేశ్వరి, టి.రాజేష్, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

రేగిడి: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను ఏవో జి.మురళీకృష్ణ మంగళవారం పరిశీలించారు. పారంపేట, ఉనుకూరు రైతు సేవా కేంద్రాలకు వెళ్లిన ఆయన అక్కడి రైతులతో కాసేపు మాట్లాడారు. సాగు చేస్తున్న ప్రతీ పంటకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని, అలా చేస్తేనే ప్రభుత్వ సదుపాయాలు వర్తిస్తాయన్నారు.